తెలంగాణభవన్‌లో నిర్వహించిన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, పువ్వాడ అజయ్‌కుమార్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాంతారావు, వనమా వెంకటేశ్వర్‌రావు, సండ్ర వెంకట వీరయ్య, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌ది కాలయాపనే

మొదటిపేజీ తరువాయి...

తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు, ఏడాదిన్నర స్వల్పకాలంలోనే కాంగ్రెస్ పార్టీ మీద విశ్వాసం కోల్పోయారని గుర్తుచేశారు. అనంతరం జరిగిన లోకసభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలయ్యిందని, ఆ ఎన్నికల్లో ప్రజలు టీడీపీని తిరిగి భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. వాగ్దానాలను నిలుపుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఉండదని విమర్శించారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నెలదాటింది. అధికారంలోకి వచ్చిన తెల్లారినుంచే హామీలను అమలు చేస్తామని ప్రకటించిన ఆ పార్టీ.. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా కాలాయపన చేస్తున్నది. కాంగ్రెస్ నెల రోజుల పాలనా పోకడలే అందుకు సాక్ష్యం. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో అప్పుడే అసహనం ప్రారంభమైంది. హామీల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ మీద ఒత్తిడి తెస్తూ రాష్ట్ర ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది. ఆ దిశగా బీఆర్ఎస్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలి' అని పిలుపునిచ్చారు.

రెండు నెలలకోసారి పార్టీ కమిటీల సమావేశాలు

ప్రతిపక్షంలో ఉంటేనే మరింత పోరాట పటిమ చూపగలమని కేటీఆర్ అన్నారు. ఉద్యమంలో గట్టిగా పోరాడిన చరిత్రను గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధికారంలో ఉండటం కన్నా ప్రతిపక్షంలో ఉండటమే కాంగ్రెస్ పార్టీకి ప్రమాదకరమని చెప్పారు. సీఎం అనే రెండక్షరాల కన్నా కేసీఆర్ అనే మూడు అక్షరాలే పవర్ ఫుల్ అని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో కేసీఆర్ ప్రజల మధ్యకు వస్తారని తెలిపారు. పార్లమెంటు నియోజక వర్గాల సమీక్షలు ముగియగానే అసెంబ్లీ నియోజక వర్గాల సమీక్షలు ఉంటాయని, త్వరలోనే రాష్ట్ర, జిల్లా కమిటీలు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. రెండుమూడు నెలలకోసారి అన్ని స్థాయిల కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖమ్మం సహా ఒకటి రెండు చోట్ల తప్పితే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తిరస్కరించలేదని చెప్పటానికి పార్టీ గెలిచిన ఎమ్మెల్యేల సంఖ్యనే నిదర్శనమని కేటీఆర్ ఉదహరించారు. 39 ఎమ్మెల్యే సీట్లను గెలవడంతో పాటు 11 స్థానాలు అత్యల్ప మెజారిటీతో చేజారిపోయాయని వివరించారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తికి కారణాలు చర్చించి, సమీక్షించి ముందుకు సాగుదామని నేతలకు దిశానిర్దేశం చేశారు. అన్నిస్థాయిల్లో పార్టీ పరంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని వివరించారు.

రాష్ట్ర ప్రతిష్ఠ బీఆర్ఎస్ బాధ్యత

ప్రజల ఆకాంక్షలకు రాజకీయ అస్థిత్వంగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను గెలిపించిందని కేటీఆర్ పేర్కొన్నారు. పదేండ్ల అనతి కాలం లోనే తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. 'తెలంగాణ గళం బీఆర్ఎస్. తెలంగాణ బలమూ బీఆర్ఎస్సే. బీఆర్ఎస్ వేయబోయే ప్రతి అడుగులో కేసీఆర్ దళంగా ఐకమత్యంగా ముందుకు సాగుదాం. తెలంగాణ సాధించిన ఘనతకు, వెలుగొందుతున్న ప్రభకు ఏమాత్రం భంగం కలిగించకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులపై ఉన్నది. ఉద్యమ స్ఫూర్తిని, నిన్నటిదాకా సాధించిన ప్రగతిని తిరిగి నిలబెట్టుకుందాం. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుందాం' అని పిలుపునిచ్చారు.

కేసీఆర్‌కు పనితనం తప్ప పగతనం రాదు: హరీశ్‌రావు

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీలో అప్పుడే గ్రూపుల తన్నులాట మొదలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్‌లో మూడు గ్రూపులున్నాయి. అందులో ఒకటి వైఎస్సార్ కాంగ్రెస్, రెండోది టీడీపీ కాంగ్రెస్, మూడోది నిజమైన కాంగ్రెస్. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయినా భవిష్యత్తు అంతా గులాబీదే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలకే బీఆర్ఎస్ పార్టీపై, నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నది. కేసీఆర్ పాలనలో మేము కక్షసాధింపు చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ నేతలు ఇవ్వాళ జైళ్లలో ఉండేవారు. కేసీఆర్ అభివృద్ధి గురించే ఆలోచించే వారు. వారికి పనితనం తప్ప పగతనం తెలియదు. కాంగ్రెస్ అన్నింటికీ 100 రోజుల డెడ్‌లైన్ పెట్టింది. ఆ గడువు అయిపోయాక ప్రజలే కాంగ్రెస్ పార్టీపై చీటింగ్ కేసులు పెడతారు' అని అన్నారు. తాము ఇక నుంచి పార్టీ శ్రేణుల దగ్గరికే వస్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను బంగారు పళ్లెంలో పెట్టి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఖమ్మం ఎంపీగా పార్లమెంటులో నామా నాగేశ్వర్‌రావు అడిగినన్ని ప్రశ్నలు మరే సభ్యుడు అడగలేదని, దీన్ని బట్టే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలపై ఉన్న ప్రేమ తెలిసిపోతున్నదని అన్నారు. బీఆర్ఎస్ లేకపోతే సులభంగా తెలంగాణకు అన్యాయం చేయవచ్చని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భావిస్తున్నారని, అందుకే తెలంగాణకు బీఆర్ఎస్ అవసరం లేదని వ్యాఖ్యానించారని మండిపడ్డారు.

మన కొమ్ములను మనమే నరుక్కున్నాం: వద్దిరాజు

బీఆర్ఎస్ చెట్టు కొమ్మలను మనమే నరుక్కున్నామని, చివరికి చెట్టే కూలిపోయిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. జనం నాడిని పసిగట్టలేకపోయామని తెలిపారు. ఖమ్మం జిల్లా రాజకీయాలు భిన్నంగా ఉంటాయని, నాయకుల మధ్య విబేధాలు ఎక్కువయ్యాయని మాజీ స్పీకర్ పోచారం చెప్పారు. విబేధాలు పక్కనపెట్టి లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి, అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వర్‌రావు, సండ్ర వెంకట వీరయ్య, హరిప్రియా నాయక్, కందాళ ఉపేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పాల్గొన్నారు.

హామీలపై ప్రశ్నిస్తే ఉలికిపాటెందుకు?

- సర్కారు రాగానే చేస్తామన్న రుణమాఫీ ఏమైంది?
- 4 వేల పింఛన్, ఉచిత కరెంటు, రైతుబంధు ఎక్కడ?
- బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నామా నాగేశ్వర్‌రావు. చిత్రంలో పువ్వాడ అజయ్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర, రేగా కాంతారావు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించటం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ కంటే ఎక్కువసార్లు తెలంగాణ గురించి లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రశ్నించామని చెప్పారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఆ తర్వాత బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ విప్ రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, బానోత్ మదన్‌లాల్, కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని అమలుకు సాధ్యంకాని హామీలిచ్చిందని, ఇప్పుడు వాటిని ఎలా అమలు చేయాలో తెలియక తల పట్టుకుంటున్నదని విమర్శించారు. ఎన్నికల ముందు పింఛన్ తీసుకోవద్దని, డిసెంబర్ తర్వాత రూ.4000 వేలు ఇస్తామని, రైతుబంధు రూ.15 వేలు వేస్తామని, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారని.. ఇప్పుడు గుర్తుచేస్తే ఉలిక్కి పడుతున్నారని మండిపడ్డారు.

ప్రజలకు లోటు కనిపిస్తున్నది: వద్దిరాజు

నెలరోజుల్లోనే తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ లేనిలోటు స్పష్టంగా కనిపిస్తున్నదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. కేసీఆర్ సీఎం పదవిలో లేకపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని చెప్పారు. అందుకే.. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్‌కే ఓటెయ్యాలని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు 420 హామీలిచ్చి.. అడిగితే ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలను బలంగా వినిపించడం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నామా నాగేశ్వరరావు తెలంగాణ బలాన్ని, గళాన్ని వినిపించిన వ్యక్తి అని, అందుకే మళ్లీ ఆయన్నే ఖమ్మం ఎంపీగా నిలబెట్టాలని పార్టీ అధ్యక్షుడిని కోరామని తెలిపారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఎమ్మెల్యే స్థానంలో పార్టీ గెలిచిందని, లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మంచి మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీని గెలిపించారని గుర్తుచేశారు. ఈసారి కూడా ఇదే జరగబోతున్నదని చెప్పారు.

ప్రజాపాలన రోడ్డుపాలు: కాంతారావు

హైదరాబాద్ నడిరోడ్డుపై ప్రజాపాలన దరఖాస్తులు దర్శనమిచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం ఉంటుందని మాజీ విప్ రేగా కాంతారావు మండిపడ్డారు. కాంగ్రెస్ నెలరోజుల పాలనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. డిసెంబర్ 9న అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. హామీలపై కాలయాపనతో సరిపుచ్చాలని ప్రభుత్వం చూస్తున్నదని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వ తీరు, మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు కాలయాపనలో భాగమేనని విమర్శించారు. నెలరోజుల్లోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించారని తెలిపారు.

సీఎం వ్యాఖ్యలతో పెద్దల సభకు అవమానం

- ఎథిక్స్ కమిటీలో చర్చించి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- చైర్మన్ గుత్తాకు ఎమ్మెల్సీల ఫిర్యాదు

మండలి చైర్మన్ గుత్తాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, వాణీదేవి, దేశపతి

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): శాసనమండలిని ఇరానీ హోటల్, కాఫీ కేఫ్‌తో పోల్చడం, సభ్యులను రియల్‌ఎస్టేట్ బ్రోకర్లని తూలనాడటం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి పెద్దల సభను అవమానించారని, దీనిపై ఎథిక్స్ కమిటీలో చర్చించి చర్యలు తీసుకోవాలని పలువురు ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్‌రావు, సురభి వాణీదేవి, దేశపతి శ్రీనివాస్ మంగళవారం శాసనమండలి చైర్మన్ చాంబర్‌లో గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. కళలు, సాహిత్యం, విద్య, వైద్య, సామాజిక, సేవా రంగాలకు చెందిన ప్రముఖులతో భాసిల్లుతూ పెద్దల సభగా పిలుచుకునే శాసనమండలిని బాధ్యతాయుతమైన సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవలో పనిచేసిన ప్రభాకర్‌రావు, ప్రజాకళాకారులు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్ లాంటివారు ఉన్నారని గుర్తుచేశారు.



రామా శ్రీనివాస్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

సమాజ సేవకుడు రామా శ్రీనివాస్ కన్నుమూత

- వరల్డ్ పద్మశాలి క్లబ్, మోక్షారామం ఫౌండేషన్ వ్యవస్థాపకుడిగా సేవలు
- మృతదేహానికి కేటీఆర్, హరీశ్ నివాళి
- కుటుంబసభ్యులకు పలువురి పరామర్శ

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ)/పోచమ్మమైదాన్: ప్రముఖ పారిశ్రామికవేత్త, వరల్డ్ పద్మశాలి క్లబ్, మోక్షారామం ఫౌండేషన్, రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామా శ్రీనివాస్ (59) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. వరంగల్ జిల్లా రామన్నపేటకు చెందిన శ్రీనివాస్ హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద దవాఖానలో చికిత్స పొందుతూ గుండెపోటుతో కన్నుమూశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, జెన్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు తదితర ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మోక్షారామం ఫౌండేషన్ ద్వారా శ్రీనివాస్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని కేటీఆర్, హరీశ్‌రావు స్మరించుకున్నారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. రామా శ్రీనివాస్ అంత్యక్రియలు బుధవారం ఉదయం 11 గంటలకు రామన్నపేటలోని శ్మశాన వాటికలో జరుగనున్నాయి.

ఆయన సేవలు అమోఘం

తల్లిదండ్రులు రామా ఆగయ్య, ఉప్పలక్ష్మి కోరిక మేరకు రామన్నపేటలో మోక్షారామం ఫౌండేషన్ ఏర్పాటుచేసి అనేక సేవ కార్యక్రమాలు చేపట్టారు. 50 లక్షలతో శ్మశానవాటికను నిర్మించారు. పేదలు, అనాథశవాలకు అయ్యే అంత్యక్రియల ఖర్చు భరించేవారు. ఫౌండేషన్ ద్వారా నిత్య అన్నదానం చేస్తున్నారు. బిడ్డల వివాహాలు చేసే ఆర్థిక స్థోమత లేని వారికి ఇప్పటివరకు 250 మందికి మంగళసూత్రాలు, వస్త్రాలు, నగదు సహాయం చేశారు.

'కాళేశ్వరం'పై విజిలెన్స్ సోదాలు

- జలసౌధలో 30 మంది అధికారుల తనిఖీ
- మంగళవారం రోజంతా కొనసాగిన తనిఖీలు
- కాళేశ్వరం ఫైళ్లు తీసుకెళ్లిన అధికారులు
- ఈఎన్సీ, సీడీవో, కార్పొరేషన్ ఆఫీసుల్లో సోదా
- ఏకకాలంలో 12 చోట్ల నిర్వహణ
- సిట్టింగ్ విచారణకు కసరత్తులో భాగంగానే
- స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మహదేవ్‌పూర్‌లోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద విజిలెన్స్ అధికారులు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విచారణకు క్యాబినెట్‌లో తీర్మానించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసింది. తాజాగా రాష్ట్ర విజిలెన్స్ విభాగం అధికారులు మంగళవారం ఆకస్మికంగా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు జరిపి పలు ఫైళ్లను తీసుకెళ్లారు.

30 మంది బృందం

రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు మంగళవారం ఉదయం 10.30 గంటలకే ఎర్రమంజిల్‌లోని రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులు, ఈఈ స్థాయి ఇంజినీర్లు, ఇతర విభాగాల నిపుణులతో కూడిన 30 మంది అధికారుల బృందం సెర్చ్ వారెంట్‌తో తరలివచ్చి సోదాలను నిర్వహించింది. విజిలెన్స్ బృందం కార్యాలయంలోకి రాగానే జలసౌధ భవనాన్ని స్వాధీనం చేసుకొన్నది. ఉద్యోగులు, ఇతరుల రాకపోకలను నిలిపేసింది. కాళేశ్వరం కార్పొరేషన్ కార్యాలయం, ఈఎన్సీ మురళీధర్, డిప్యూటీ ఈఎన్సీ, పీఅండ్‌ఎం ఎస్ఈ, రామగుండం ఈఎన్సీ, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) కార్యాలయాలను పూర్తిగా స్వాధీనం చేసుకొన్నది. అనంతరం ఈఎన్సీ మురళీధర్, అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. కాళేశ్వరంలో నిర్మించిన 3 బరాజ్‌లు, ఇతర నిర్మాణాల డిజైన్లు, ప్రాజెక్టు టెండర్ ఫైళ్లు, సాంకేతిక, ఆర్థికాంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఫైళ్లన్నింటినీ జిరాక్స్ తీసుకుని సాయంత్రం 6 గంటల తరువాత జలసౌధ నుంచి వెళ్లిపోయారు. దాదాపు 7గంటల పాటు సోదాలు కొనసాగాయి. ఫైళ్లు, కంప్యూటర్ల హర్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తున్నది.

ఏకకాలంలో 12 చోట్ల

జలసౌధతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 12 చోట్ల ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో, అదనపు ఎస్పీ బాలకోటయ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని కాళేశ్వరం ప్రాజెక్టు కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ మురళీధర్‌రావు క్యాంపు కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సీఐలు నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రావు, ఎస్ఐ నారాయణబాబు, నీటి పారుదలశాఖ విజిలెన్స్ డీఈ శ్రీనివాస్, ఏఈ శశిధర్ నేతృత్వంలో రాత్రి 7 గంటలకు సోదాలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఎన్టీపీసీలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన 3 కార్యాలయాల్లో విజిలెన్స్ అదనపు ఎస్పీ బాలకోటయ్య ఆధ్వర్యంలో మూడు బృందాలు ఒకే సమయంలో తనిఖీలు జరిపాయి. భీమునిపట్నం, చిలుకలయ్యగుడి ప్రాంతంలోని నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలో బాలకోటయ్య తనిఖీలు నిర్వహించగా, కృష్ణానగర్‌లోని ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో విజిలెన్స్ డీఎస్పీ కమలాకర్‌రెడ్డి, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని కార్యనిర్వాహక ఇంజినీర్ నాణ్యత నియంత్రణ తనిఖీ కార్యాలయంలో విజిలెన్స్ సీఐ జీసీ రాజు తనిఖీల్లో పాల్గొన్నారు. విజిలెన్స్ ఎస్పీ శ్రీరామోజు రమేశ్ ఆధ్వర్యంలో నలుగురు డీఎస్పీల బృందం, మరో పదిమంది ఇంజినీర్ల బృందం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాయి. తొలుత మహదేవ్‌పూర్‌లోని ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాల్లో, విజిలెన్స్, ఇంజినీర్ల బృందాలు కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల వద్ద కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. బుధవారం కూడా విజిలెన్స్ తనిఖీ కొనసాగనున్నట్టు తెలుస్తున్నది. విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు. కేవలం ఫైల్స్ మాత్రమే స్వాధీనం చేసుకుంటున్నామని వివరించారు. అధికారులు చక్కగా సహకరిస్తున్నారని, బుధవారమూ కొనసాగుతుందని వెల్లడించారు.

విచారణకు లేఖ రాశాం: మంత్రి ఉత్తమ్

మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు కుంగిపోవడంపై విచారణ చేపట్టాలని విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించామని సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగానే మేడిగడ్డ నుంచి హైదరాబాద్ వరకు ఉన్న పలు నీటి పారుదల కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారని స్పష్టం చేశారు. మేడిగడ్డ బరాజ్ పిల్లర్ల కుంగుబాటు అంశాన్ని తమ ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తున్నదని, ఇప్పటికే ప్రాజెక్టుపై పూర్తి సమాచారంతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చామని తెలిపారు. తదుపరి చర్యల్లో సిట్టింగ్ న్యాయమూర్తితో జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని పేర్కొన్నారు.

నేడు సీఎం సమీక్ష..

సాగునీటిపారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించనున్నారని సమాచారం. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, వాటి పురోగతి, యాసంగి నీజన్‌కు నీటి విడుదల తదితర అంశాలపై సమీక్ష నిర్వహించాలని గతంలోనే నిర్ణయించినా ప్రజాపాలన దరఖాస్తులపై, క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో వాయిదా వేశారు. దాన్ని బుధవారం నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు. విజిలెన్స్ సోదాల మరుసటి రోజునే ఇరిగేషన్‌శాఖపై సమావేశం నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకున్నది.

లోకం పోకడ



మండలి బీఆర్ఎస్‌పక్ష నేతగా సిరికొండ?

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని ఎంపిక చేసే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మధుసూదనాచారి రాష్ట్ర శాసనసభకు తొలి స్పీకర్‌గా పనిచేశారు. 2018 శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన అనంతరం ఆయన 2021 నవంబర్‌లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ అయ్యారు. 2027 నవంబర్ వరకు ఆయన ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. పార్టీలో సీనియర్ నాయకుడిగానే కాకుండా శాసనమండలిలోనూ బీఆర్ఎస్‌కు సీనియర్ ఎమ్మెల్సీగా ఉన్నారు. శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మధుసూదనాచారి నియమించే అవకాశాలున్నాయని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్టు తెలుస్తున్నది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	10.7°c	34.7°c
మెదక్	14.8°c	31.3°c
రంగారెడ్డి	14.9°c	34.3°c
నల్లగొండ	17.4°c	32.2°c
నిజామాబాద్	17.7°c	32.0°c
వరంగల్	18.0°c	30.0°c
కరీంనగర్	19.0°c	30.0°c
ఖమ్మం	19.0°c	30.0°c
హైదరాబాద్	20.0°c	27.5°c
మహబూబ్‌నగర్	20.6°c	29.0°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

టెక్నికల్ పోస్టులు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 16
- పోస్టులు: సీనియర్ ప్రాజెక్ట్ ఇంజినీర్, అసోసియేట్ ఫుట్‌వేర్ డిజైనర్, జూనియర్ టెక్నాలజిస్ట్, ప్రాజెక్ట్ టెక్నీషియన్
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 29
- వెబ్‌సైట్: https://fddiindia.com

డీఆర్‌డీవోలో...

డీఆర్‌డీవో పరిధిలోని సెంటర్ ఫర్ ఫైర్, ఎక్స్‌ప్లోజివ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సేఫ్టీలో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)
- విభాగాలు: కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ
- ఎంపి